ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 14 మే 2024

పట్టణవాసులకు పట్టని 'పార్లమెంట్'
అసెంబ్లీతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో భారీగా తగ్గిన ఓటింగ్
మల్కాజిగిరిలో 7.73శాతానికిపైగా తగ్గుదల
చేవెళ్ల పార్లమెంట్‌లో 5శాతానికిపైగా తగ్గిన పోలింగ్
గత పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే స్వల్ప పెరుగుదల
ఏపీలో ఓటు వేసేందుకు భారీగా తరలివెళ్లిన సెటిలర్స్
7

లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6గంటల వరకూ కొనసాగింది. ఓటర్లు భారీ సంఖ్యలో పాల్గొని ఓటు వేసి ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటారు. చెదురుమదురు సంఘటనల మినహా పోలింగ్ ప్రక్రియ జిల్లాలో విజయవంతమైంది. పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను, వీవీ ప్యాట్లను పోలింగ్ సిబ్బంది రిసెప్షన్ సెంటర్లకు చేర్చారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

- ఓట్లు వేసేందుకు ఉదయం నుంచే బారులు
- ఓటు వేసిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అభ్యర్థులు
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు.. పోలింగ్ ఆలస్యం
- కులచర్లలో బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య తోపులాట


దోమ మండలం ఐనాపూర్‌లో ఓటర్ల బారులు



పోలింగ్ ప్రశాంతం

లోక్‌సభ ఎన్నికల్లో పోటెత్తిన ఓటింగ్


పరిగిలో మొదటి సారి ఓటేసిన యువతి

రంగారెడ్డి అర్బన్/వికారాబాద్/మేడ్చల్, మే 13 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటల నుంచి ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్దకు బారులు తీరారు. దీంతో దీంతో పోలింగ్ కేంద్రాలు సందడిగా మారాయి. పలువురు ప్రముఖులు, అధికారులు, అభ్యర్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదర్శ కేంద్రాలను ముస్తాబు చేయడంతో అక్కడ పండగ వాతావరణం తలపించింది. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఈ సారి ఎన్నికల సంఘం పోలింగ్ సమయాన్ని గంట పొడిగించింది. దీంతో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. నిర్ణీత సమయంలో పోలింగ్ కేంద్రంలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. సమస్యాత్మక, అతిసమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహించారు. చేవెళ్ల బరిలో పోటీలో 43 మంది మూడు, మల్కాజిగిరిలో 22మంది అభ్యర్థులు ఉండటంతో రెండు బ్యాలెట్లు ఉపయోగించారు. 10,757 బ్యాలెట్ యూనిట్లు, 3,591 కంట్రోల్ యూనిట్లు, 4008 వీవీ ప్యాట్లు వినియోగించారు. ఎన్నికలు ముగిసే సమయం వరకు నిఘా బృందాలు 256 సెక్టార్లలో నిఘా ఉంచారు. దివ్యాంగులు, వృద్ధులు ఓటేందుకు వీలుగా వీల్ చైర్ సౌకర్యం కల్పించారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించలేదు.

కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షణ

రాజేంద్రనగర్‌లోని నారం గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి రంగారెడ్డి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక పరిశీలించారు. అలాగే మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి ఎన్నికల సరళిని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు పరిశీలించా. వికారాబాద్ కలెక్టరేట్ నుంచి నారాయణరెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు.

ఓటు వేసిన ప్రముఖులు

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రముఖులు, అభ్యర్థులు, ప్రజా ప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ ఉన్నత పాఠశాలలో సీఎం రేవంత్‌రెడ్డి ఓటు వేయగా... మర్పల్లి మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఓటు వేశారు. మొయినాబాద్ మండలం ఎనికేపల్లిలో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి తన సతీమణి సీతారెడ్డి, కుమార్తె పూజా ఆకాంక్షరెడ్డి, కుమారుడు రాజ్ అర్యన్‌రెడ్డి ఓటు వేశారు. చేవెళ్ల మండలం ధర్మసాగర్ గ్రామంలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తయయుడు ఆనందిత్‌రెడ్డి, కోడళ్లు శ్రియ, రిషిక ఓటు వేశారు. మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పూడూరులో తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఉప్పల్ నియోజకవర్గం హబ్సిగూడలో ఓటు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి యాలాల మండలం దౌలాపూర్‌లో ఓటు వేశారు. చేవెళ్ల మండలం కౌకుంట్ల గ్రామంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, కోడలు శ్రవంతి, ఆమె తనయులు కార్తీక్‌రెడ్డి, కల్యాణ్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి ఓటు వేశారు. అలాగే మాజీ హోంమంత్రి, రాజ్యసభ సభ్యుడు తూళ్ల దేవేందర్‌గౌడ్ తన కుటుంబ

మిగతా 7వ పేజీలో...


మర్పల్లిలో ఓటేసేందుకు వెళ్తున్న 103ఏళ్ల వృద్ధురాలు

ఓటేసిన ఎన్నికల అధికారులు.. 103 ఏళ్ల వృద్ధురాలు

లోక్‌సభ ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక ఖైరతాబాద్ అసెంబ్లీ పరిధిలో ఓటు వేశారు. అలాగే మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అంతాయపల్లిలో. వికారాబాద్‌లోని సంఘం లక్ష్మీబాయి పాఠశాలలో కలెక్టర్ నారాయణరెడ్డి దంపతులు ఓటు వేశారు. కాగా నేటి సమాజంలో ఎన్నికలు వస్తే హలిడేగా భావించే తరుణంలో మర్పల్లి మండలానికి చెందిన 103ఏళ్ల వృద్ధురాలు మర్పల్లి పోలింగ్ కేంద్రానికి వచ్చి తన ఓటు హక్కును వినియోగించుకొని ఆదర్శంగా నిలిచింది.



ఓటేసిన అభ్యర్థులు


ధర్మసాగర్‌లో ఓటేసిన కొండా దంపతులు


ఎనికేపల్లిలో ఓటేసిన గడ్డం రంజిత్‌రెడ్డి దంపతులు


పూడూరులో ఓటేసిన ఈటల కుటుంబీకులు

చేవెళ్ల పార్లమెంట్

నియోజకవర్గం ఓటింగ్ శాతం	ఉదయం 9గంటలు	ఉదయం 11 గంటలకు	మధ్యాహ్నం ఒంటి గంటకు	మధ్యాహ్నం 3 గంటలకు	సాయంత్రం 5 గంటలకు	సాయంత్రం 6 గ. వరకు
మహేశ్వరం	7.26	18.65	31.84	41.23	49.77	51.07
రాజేంద్రనగర్	7.12	18.49	31.49	42.15	50.54	53.38
శేరిలింగంపల్లి	6.59	16.49	27.49	35.55	41.70	43.11
చేవెళ్ల	10.31	25.21	43.11	58.62	68.23	71.09
పరిగి	11.38	25.61	43.57	56.36	62.59	65.18
వికారాబాద్	10.37	27.30	45.16	57.63	66.86	69.44
తాండూరు	11.85	23.12	41.05	54.95	63.00	66.34
మొత్తం	10.28	20.35	34.56	45.35	53.15	59.94


చేవెళ్ల మండల పరిధిలోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల బారులు

పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం నిరసనలు


కొడిచర్ల తండా వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులతో మాట్లాడుతున్న ఏఆర్‌వో రవీందర్‌రెడ్డి

తమకు అందుబాటులో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఓటర్లు నిరసన వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తేనే మేమంతా ఓట్లు వేస్తామని, లేదంటే.. పోలింగ్‌ను బహిష్కరిస్తామని ప్రకటించారు. షాద్‌నగర్ అసెంబ్లీ నియోజవర్గ కొత్తూరు మండలం కొడిచర్ల తండా కందుకూరు మండలం చీమలవాణి కుంట వాసులు ఎన్నికలను బహిష్కరించారు. ధర్నా చేపట్టారు. సమాచారం తెలుసుకున్న అధికారులు గ్రామాలకు చేరుకుని నచ్చజెప్పారు. వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో వారంతా ఓట్లు వేశారు.


మర్పల్లిలో ఓటేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్


ఓటేసిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, సునీతారెడ్డి


ఉప్పల్‌లో ఓటేసిన బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి

గెలుపుపై ఎవరి ధీమా వారిదే!

- ఫలితాల కోసం 20 రోజుల పాటు టెన్షన్!

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఎన్నికల పోరు ముగిసింది. పోలింగ్ ముగియడంతో ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ విజయవకాశాలపై అంచనాలు వేసుకుంటూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నాయి. గెలుపుపై పైకి ధీమాగా ఉన్నప్పటికీ కౌంటింగ్‌కు ఇంకా 20 రోజులు గడువు ఉండడంతో అభ్యర్థులు టెన్షన్ పడుతున్నారు. రాష్ట్రంలో అత్యంత కీలకమైన చేవెళ్ల, మల్కాజిగిరి నియోజకవర్గ ఎన్నికలను ఆయా రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల నుంచి బడా నేతలు రంగంలో దిగారు. వీరి గెలుపు కోసం అతిరథమహారథులంతా ఇక్కడకు వచ్చి ప్రచారం చేశారు. ఈ రెండు నియోజకవర్గాల్లో త్రిముఖ పోటీ నెలకొనడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఈ రెండు పార్లమెంట్ పరిధిలో భారీగానే ఓట్లు సాధించినప్పటికీ అధికారం కోల్పోవడంతో క్షేత్రస్థాయిలో పూర్తిగా డీలా పడింది. కేడర్‌ను కాపాడుకునేందుకు నానా కష్టాలు పడింది. ఇదే సమయంలో బీజేపీ అనూహ్యంగా పుంజుకుని అధికార కాంగ్రెస్‌కు దీటుగా ఎన్నికల్లో పోరాడింది. క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ ఓటు బ్యాంకును తమ వైపు లాక్కునేందుకు అధికార కాంగ్రెస్ ప్రయత్నించినప్పటికీ పెద్దగా సఫలం కాలేదు. బీఆర్ఎస్ ఓటు బీజేపీ కూడా గణనీయంగా చీల్చుకోవడంతో ఎన్నికల ఫలితాలు అంతుచిక్కడం లేదు.

పోలింగ్ సరళిపై లోలోపల ఆందోళన

ఇదిలా ఉంటే చేవెళ్ల నుంచి అధికార కాంగ్రెస్ తరుపున రంజిత్ రెడ్డి బరిలో దిగగా బీజేపీ నుంచి కొండా విశ్వేశ్వరెడ్డి, బీఆర్ఎస్ నుంచి కాసాని జ్ఞానేశ్వర్ పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఈ ముగ్గురు కూడా సంపన్నులే కావడంతో ఎన్నికల్లో భారీగా ఖర్చుచేశారు. క్షేత్రస్థాయిలో హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. ఇక మల్కాజిగిరి నుంచి కాంగ్రెస్ తరుపున పట్నం సునీతారెడ్డి, బీజేపీ తరుపున ఈటల రాజేందర్, బీఆర్ఎస్ తరుపున రాగిడి లక్ష్మారెడ్డి బరిలో దిగారు. ఈ రెండు స్థానాల్లో త్రిముఖ పోటీ జరుగుతుందని భావించినప్పటికీ చివరకు రెండు జాతీయ పార్టీల మధ్యే తీవ్రపోరు జరిగినట్లు పోలింగ్ సరళిబట్టి తెలుస్తోంది. ఇదిలా ఉంటే కీలకమైన ఈ స్థానాల్లో పోలింగ్ ముగియడంతో ఆయా పార్టీలు గెలుపోటములపై లెక్కలు వేసుకుంటున్నాయి. ప్రధాన పార్టీ అభ్యర్థులంతా గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ పోలింగ్ సరళి చూసిలో లోపల ఆందోళన చెందుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఓటింగ్ శాతం గణనీయంగా తగ్గింది. అయితే గత పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే కొన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ పెరిగింది. కొన్ని చోట్ల పెరిగిన ఓటింగ్, మరికొన్ని చోట్ల తగ్గిన ఓటింగ్ ప్రభావం తమపై ఏ మేర ప్రభావం చూపుతుందోనని లెక్కలు వేసుకుంటున్నారు.



స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలు భద్రం



బీఎస్ఐటీకి తరలిస్తున్న ఈవీఎంలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

ఓటింగ్ ముగియడంతో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ఈవీఎంలన్నింటినీ భారీ పోలీసు భద్రత మధ్య చేవెళ్ల మండలం గొల్లపల్లిలోని బీఎస్ఐటీ కాలేజీ స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఓటింగ్ పక్రియ ముగియగానే ఈవీఎంలు,. వీవీప్యాట్‌లకు సీల్ వేసి తొలుత అసెంబ్లీ స్థాయిలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి తరలించారు. అనంతరం అక్కడ నుంచి ఈవీఎంల సంఖ్యను సరి చూసుకుని నేరుగా కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు

- చేవెళ్ల బీఎస్ఐటీకి తరలింపు

అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కట్టుదిట్టమైన భద్రత నడుమ ఇక్కడకు ఈవీఎంలు తీసుకువచ్చారు. ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించే వాహనాలకు జీపీఎస్ అనుసంధానం చేసి ట్రాకింగ్ చేశారు. సోమవారం రాత్రి అభ్యర్థుల సమక్షంలో వీటిని స్ట్రాంగ్‌రూమ్‌లో చేర్చారు. ఓట్ల లెక్కింపు మే 4న బీఎస్ఐటీ కాలేజీ జరగనుంది. కౌంటింగ్ పూర్తయ్యే వరకు ఈవీఎంలు, వీవీప్యాట్‌ల భద్రత కోసం మూడంచెల భద్రత వ్యవస్థ ఏర్పాటు చేశారు. సీసీటీవీ పర్యవేక్షణలో నిరంతరం సీఆర్‌పీఎఫ్, కేంద్ర బలగాల స్ట్రాంగ్ చుట్టూ పహారాకాస్తున్నాయి.


వికారాబాద్: రిసెప్షన్ కేంద్రాలకు తరలుతున్న ఈవీఎంలు

తాండూరును వీడేది లేదు

● వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచే పోటీ చేస్తా
● మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

తాండూరు, మే 13 : తాండూరును విడిచిపెట్టి వెళ్లారని కొందరు తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని, ఎట్టి పరిస్థితుల్లోను తాండూరును వీడేది లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా తాండూరులో ఓటు వేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తాండూరు నుంచి పోటీ చేస్తానని తెలిపారు.


తాండూరులో మీడియాతో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

తనపై ఎవరు తప్పుడు ప్రచారం చేసినా ప్రజలు నమ్మరని అన్నారు. తాండూరు ప్రజలు తనకు ఎమ్మెల్యేగా, మంత్రిగా అవకాశం కల్పించి గుర్తింపు ఇచ్చారని ఆయన అన్నారు. ఆయనతో కాంగ్రెస్ నాయకులు కరుణం పురుషోత్తంరావు, అబ్దుల్ రవూఫ్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

నా ఓటు వేసేదెలా?

● వేరే వ్యక్తి వేస్తే నా పరిస్థితేంటి?
● అధికారులను ప్రశ్నించిన ఓటరు
● పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారని చెప్పిన అధికారులు
● విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్
● కలెక్టర్ ఆదేశంతో ఎట్టకేలకు ఓటుహక్కు వినియోగించుకున్న ఓటరు

బంట్వారం, మే 13(ఆంధ్రజ్యోతి) : ఓటు వేసేందుకు వెళ్లిన వ్యక్తికి అప్పటికే తన ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారని అధికారులు చెప్పడంతో అవాక్కయ్యాడు. నా ఓటు హక్కును వేరే వ్యక్తి వినియోగించుకున్నాడని, అలాంటప్పుడు తాను ఓటు ఎలా వేయాలని అధికారులను ప్రశ్నించాడు. వికారాబాద్ జిల్లా బంట్వారం మండల కేంద్రానికి చెందిన దొరెటి సుధాకర్ సోమవారం ఓటు వెయ్యడానికి బూత్(253)కు వెళ్లాడు. తీరా చూస్తే అప్పటికే అతడి ఓటు


ఓటుహక్కు వినియోగించుకున్న సుధాకర్

హక్కును వేరే వ్యక్తి పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నాడని తెలుసుకున్నాడు. తాను ప్రభుత్వ ఉద్యోగిని కాదని, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఎలా ఓటు వేస్తానని అధికారులను ప్రశ్నించాడు. దానికి వారు సరైన సమాధానం చెప్పకుండా బూత్ లోపల నుంచి వెళ్లిపోవాలని సుధాకర్‌కు సూచించారు. ఈ విషయమై స్థానిక ఎన్నికల సహాయ అధికారికి వివరించగా.. సరైన సమాధానం చెప్పలేకపోయారు. నాకు నా ఓటు ముఖ్యం.. నా హక్కును నేను వినియోగించుకుంటానని సుధాకర్ బయటకు వచ్చి అధికారులను ప్రాధేయపడినా సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. దాంతో ఈ విషయం స్థానిక విలేకరులకు తెలియజేయడంతో అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాలతో ఎట్టకేలకు సుధాకర్ ఓటు వినియోగించుకున్నాడు.

ఉమ్రా యాత్రికులకు ఘన స్వాగతం

శంషాబాద్ రూరల్ మే 13 : 15 రోజుల క్రితం ఉమ్రా యాత్రకు వెళ్లిన ముస్లింలు తిరిగి సోమవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు యాత్రికులకు ఎయిర్‌పోర్టులో ఘనంగా స్వాగతం పలికారు. అల్‌మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో యాత్రకు వెళ్లి పవిత్ర మక్కా, మదీనాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా అక్కడున్న పర్యాటక ప్రదేశాలను సందర్శించినట్లు పేర్కొన్నారు. ట్రావెల్స్ ఎండీ ఫయాజ్ అలీ మాట్లాడుతూ ప్రతీ ముస్లిం జీవితంలో ఒక్కసారైనా మక్కాలో ప్రత్యేక ప్రార్థనలు


ఎయిర్‌పోర్టులో స్వాగతం పలుకుతున్న కుటుంబ సభ్యులు

చేయాలని భావిస్తున్నారని, మా సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ 15 రోజులకొకసారి యాత్రకు తీసుకెళ్తామని ఆయన తెలిపారు.

బస్సు ఎక్కుతూ కిందపడిన మహిళ

● డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ప్రయాణికుల ఆగ్రహం
● బస్సు ఎక్కుతుండగా ముందుకు పోనిచ్చాడని గొడవకు దిగిన ప్యాసింజర్లు
● మహిళకు స్వల్పగాయాలు.. బస్సు ముందు అద్దాలు పగులగొట్టిన ఓ ప్రయాణికుడు
● గాయాలైన మహిళ, డ్రైవర్.. ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు

యాలాల, మే 13 : బస్సు ఎక్కుతుండగా ఓ మహిళ ఫుట్‌బోర్డు నుంచి కిందపడటంతో మిగతా ప్రయాణికులు ఆగ్రహానికి గురై బస్సు అద్దాలు పగులగొట్టిన ఘటన సోమవారం మండల పరిధిలోని లక్ష్మీ నారాయణపూర్ చౌరస్తాలో జరిగింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు నుంచి మహబూబ్ నగర్‌కు సోమవారం మధ్యాహ్నం తాండూరు డిపోకు చెందిన ప్రైవేటు బస్సు (టీఎస్ 06 యూబీ 8078) ప్రయాణికులతో బయలుదేరింది. లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా వద్ద మహబూబ్ నగర్ వెళ్లేందుకు ప్రయాణి


బస్సు ముందు బైఠాయించి ఆందోళన చేస్తున్న మంజుల, ప్రయాణికులు

కులు బస్సు కోసం వేచి చూస్తున్నారు. ఇంతలో బస్సు రాగానే డ్రైవర్ నవీన్ కుమార్ సడన్‌గా ఆపి వెంటనే వెళ్లేందుకు యత్నించాడు. అదే సమయంలో మంజుల అనే మహిళ బస్సు ఎక్కేందుకు ఫుట్‌బోర్డుపైకి ఎక్కింది. బస్సు కదలడంతో కాలు జారి కింద పడింది. గమనించిన చౌరస్తా వద్ద ఉన్న మిగతా ప్రయాణికులు బస్సు ఆపాలని పెద్దగా అరిచారు. అందులో ఒకరు బస్సు ముందు అద్దంపై రాయితో దాడి చేశాడు. కాగా, ప్రయాణికులు బస్సు ఎక్కుతుండగా డ్రైవర్ ఎందుకు ముందుకు పోనిచ్చాడని కోపంతో ఊగిపోయారు. మంజులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికులు కొద్దిసేపు బస్సు ముందు బైఠాయించి ఆందోళనకు దిగారు. డ్రైవర్ నవీన్ కుమార్‌పై యాలాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, డ్రైవర్ ప్రయాణికులపై ఫిర్యాదు చేశాడు.

పొంచి ఉన్న ప్రమాదం.. జర భద్రం!

● ప్రమాదకరంగా సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు

కొత్తూర్, మే 13 : మండల పరిధి సిద్దాపూర్ గ్రామంలో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన మూడు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి గృహాలకు, వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. ఒక్కొక్కటి 15హెచ్‌పీ చొప్పున మూడు ట్రాన్స్‌ఫార్మర్లను కిందనే ఏర్పాటు చేశారు. వాటికి కనీసం గజం ఎత్తయినా గద్దె నిర్మించలేదు. ఇక్కడికి పశువులు వచ్చినా, పొరపాటున మనుషులు వెళ్లినా కరెంట్ షాక్ కొట్టి ప్రాణాలు పోవడం ఖాయం. వర్షం వస్తే కొద్ది దూరం మేరకు ఎర్తింగ్ వచ్చే ప్రమాదం ఉంది. ఇలా కింద పడితే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే ఆస్కారం కూడా ఉంది. అలాగే మోటార్లకు, గృహాలకు అత్యధిక వోల్టేజీ వచ్చి విద్యుత్ పరికరాలు కాలిపోయే ప్రమాదం కూడా ఉంది. ట్రాన్స్‌కో అధికారులు ఇంత నిర్లక్ష్యంగా ట్రాన్స్‌ఫార్మర్లను నేతలపై ఎలా పెడతారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. వాటికి గద్దె కట్టించాలని చాలాసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయలేదు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కన్పించక వాటికి తగిలే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు ప్లాట్‌ఫాం కట్టించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


సిద్దాపూర్‌లో నేలపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

చల్లని నీటికి.. కుండలపై క్రేజ్

● వేసవిలో భారీగా కొనుగోళ్లు ● మట్టికుండలో నీటికే ప్రజల మొగ్గు


కుండలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆమనగల్లు, మే 13 : ఎండ కాలంలో చల్లని నీటి కోసం ప్రజలు మట్టి కుండల కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. ఫ్రిజ్‌లు కొనలేని పేదలు కుండలను కొంటున్నారు. చల్లని నీటితో దాహం తీర్చుకుంటున్నారు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా కుమ్మరలు కూడా వివిధ రూపాల్లో ఆకట్టుకునేలా కుండలను చేసి విక్రయిస్తున్నారు. రోడ్డు పక్కన అమ్ముతున్నారు. వచ్చీపోయే ప్రయాణికుల చూపును కుండలు ఆకర్షిస్తున్నాయి. ఆమనగల్లులో కుండల విక్రయాలు జోరందుకున్నాయి. కాగా, సైజును బట్టి రూ.100 నుంచి రూ.400 వరకు కుండలు, కూజాలు అమ్ముతున్నారు. ఆరోగ్యరీత్యా కూడా కుండ నీరు తాగేందుకు చాలా మంది ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈక్రమంలో ఎండకాలం నేపథ్యంలో మరో నెల రోజులపాటు కుండల వ్యాపారం జోరుగా సాగనుంది.

ఫూడూరు మామిడికి భలే డిమాండ్

● జాతీయ రహదారి పక్కన జోరుగా విక్రయాలు

పూడూరు, మే 13 : మామిడి పండ్లకు పూడూరు మండలం హబ్‌గా ఉంది. ఇక్కడి రైతులు పండ్ల తోటల వద్ద జాతీయ రహదారి పక్కన షెడ్డును ఏర్పాటు చేసుకుని రకరకాల మామిడి పండ్లను తోట నుంచి నేరుగా వినియోగదారుడికి విక్రయిస్తుంటారు. ఈ మార్గం వెంట వెళ్లే ప్రయాణికులు మామిడి పండ్లను జోరుగా కొనుగోలు చేస్తున్నారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా పెంచడంతో చాలా రుచిగా ఉంటాయని హైదరాబాద్‌తో పాటు తదితర ప్రాంతాలకు చెందినవారు అధికంగా కొనుగోలు చేస్తున్నారు. ఒక్కొక్కరు 5కిలోల నుంచి ఆపైగా కొనుగోలు చేస్తుంటారు. జాతీయ రహదారిలోని సాయిపత్తి మిల్లు ఎదురుగా పూడూరు గ్రామానికి చెందిన బాసిత్ పండ్లు విక్రయిస్తున్నాడు.


బీజాపూర్-హైదరాబాద్ జాతీయ రహదారిపై వివిధ రకాల మామిడి పండ్లను విక్రయిస్తున్న రైతు

గురువు కుటుంబానికి
పూర్వ విద్యార్థుల చేయూత


ఆర్థికసాయం అందజేస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్

కడ్తాల్, మే 13: అనారోగ్యంతో మృతిచెందిన ఉపాధ్యాయుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు చేయూతనందించారు. గురువు కుటుంబానికి అండగా నిలిచి గురుభక్తిని చాటుకున్నారు. కడ్తాలకు చెందిన ఎస్.సుదర్శన్ ఓ ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయుడిగా పనిచేసే వారు. ఆదివారం రాత్రి అనారోగ్యంతో ఆయన మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 1999 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, అనిల్, నరేందర్, రఘునాథ్, సుజాత, శ్రీనాథ్ సోమవారం సుదర్శన్ మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం గురువు కుటుంబానికి పూర్వవిద్యార్థులు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా అండగా ఉంటామని మనో ధైర్యం కల్పించారు.

ఘనంగా మాతృ దినోత్సవం

షాబాద్, మే 13: సృష్టిలో తల్లిని మించిన దైవం లేదని మహిళా సంఘం నాయకురాలు ఉమారాణి అన్నారు. అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రాత్రి మండల పరిధిలోని తాళ్లపల్లిలో మహిళలతో కలిసి కేక్ కట్ చేసి మహిళలకు పంచిపెట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆమె మాట్లాడుతూ సృష్టిలో తల్లిని మించిన దైవం లేదని ఆమె అన్నారు. ప్రేమ పంచాలన్నా, దండించాలన్నా, దగ్గరకు తీయాలన్నా ఒక్క తల్లికే సాధ్యమని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.


తాళ్లపల్లిలో కేక్ కట్‌చేస్తున్న మహిళలు


మొయినాబాద్ ఎన్కతలలో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు



పరిగిలో బారులు తీరిన ఓటర్లు


బీఎస్ఐటీకి తరలిస్తున్న ఈవీఎంలు

పోలింగ్ ప్రశాంతం

(ఐదో పేజీ తరువాయి)

సభ్యులతో ఓటు వేశారు. శంకర్‌పల్లి మండలం మాసానిగూడలో మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఓటు వేశారు. చేవెళ్ల మండలం పామెన గ్రామానికి చెందిన బిత్తిరి సత్తి ఓటు హక్కును వినియోగించుకున్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సొంతూరు చించల్‌పేట్‌లో ఓటు వేయగా చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం కేతిరెడ్డిపల్లిలో ఓటు వేశారు. డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి కౌకుంట్లలో ఓటు వేశారు.

మొరాయించిన ఈవీఎంలు..

కందుకూరు మండలంలోని కొత్తగూడలో అరగంట పాటు కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్ మొరాయించింది. విషయం తెలుసుకున్న ఎన్నికల సంఘం అధికారులు మరమ్మతులు చేశారు. అనంతరం గ్రామస్తులు సజావుగా తమతమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం తిర్మలాపూర్‌లోని 257 బూత్‌లో ఈవీఎం 40 నిమిషాలపాటు మొరాయించింది. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని రావిర్యాలలో ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన ఓటింగ్ ఉదయం 9గంటలకు ప్రారంభమైంది. అలాగే సాయంత్రం 4:30 గంటల సమయంలో చలివేంద్రంపల్లి గ్రామాల్లో ఈవీఎంలు మోరాయించి పని చేయక పోవడంతో అధికారులు స్పందించి మరో యంత్రాన్ని ఏర్పాటు చేశారు. వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం అల్లీపూర్‌లోని 210 పోలింగ్ కేంద్రంలో మధ్యాహ్నం 3.10 గంటలకు ఈవీఎంలలో ఎర్రర్ రావటంతో పోలింగ్ నిలిచిపోయింది. కొత్త ఈవీఎంలను ఏర్పాటు చేసి తిరిగి పోలింగ్‌ను కొనసాగించారు. గంట పాటు పోలింగ్ నిచిపోయింది. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని మూడు చింతలపల్లిలో 108 పోలింగ్ కేంద్రంలో 30 నిమిషాలపాటు ఈవీఎంలు మొరాయించాయి. ముచ్చింతల్‌గ్రామంలో ఈవీఎంలు మొరాయించాయి. మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి 173 పోలింగ్ కేంద్రం, షాబాద్ మండలం కొమరబండలోని 228 పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించాయి. కులకచర్ల మండలంలోని ముజాహిద్‌పూర్, లింగన్‌పల్లి గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో కాస్త ఆలస్యమైంది.మొయినాబాద్ మండల పరిధిలోని ఎన్కేపల్లిలోని 142 బూత్‌లో ఈవీఎం మిషన్ మొరాయించింది.ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్‌లో గల 284వ పోలింగ్ బూత్‌లో ఉధయం 2గంటల పాటు ఈవీఎం మొరాయించడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జీవన్గి గ్రామంలో ఓ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం కంట్రోల్ యూనిట్ మొరయించడంతో కొంత సేపు పోలింగ్ సిబ్బంది, ఇటు ఓటర్లు ఇబ్బంది పడ్డారు.


వికారాబాద్ కలెక్టరేట్‌లో పోలింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల ఘర్షణ

కులకచర్ల : వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలంలోని బండ వెల్కిచర్ల గ్రామంలోని పోలింగ్ కేంద్రం వద్ద ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు ఒకరిపై ఒకరు ఘర్షణకు దిగారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ కార్యకర్తలు.. లేదు మీరే చేస్తున్నారని కాంగ్రెస్ కార్యకర్తలు ఒకరిపై ఒకరు నిలదీయగా గొడవకు దారి తీసింది. ఈ క్రమంలో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు వెంటనే వారిని అక్కడి నుంచి చెదరగొట్టారు.

మొదటి ఓటు

మర్పల్లి: మొదటి సారి ఓటు హక్కు రావడంతో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎలాంటి సౌకర్యాలు లేకపోయినా ఎండలో రెండు కిలో మీటర్ల మేర నడిచి వెళ్లి గిరిజన యువతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.



గణనీయంగా పెరిగిన ఓటింగ్ శాతం

మునుపెన్నడూ లేనివిధంగా ఈసారి ఎన్నికల్లో మొదటి రెండు గంటలకే సగటున 10.28 శాతం ఓటింగ్ నమోదయ్యింది. అనంతరం కూడా అంతకంతకూ ఊపందుకుంది. ఉదయం 11 గంటల సమయానికి 20.35 శాతం జరిగిన ఓటింగ్, మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 34.56 శాతానికి, మధ్యాహ్నం 3 గంటల సమయానికి 45.35 శాతానికి, సాయంత్రం 5 గంటల సమయానికి 53.15 శాతానికి చేరుకుంది. సాయంత్రం 6 గంటల వరకు -- శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ప్రారంభ సమయానికే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్‌లలో నిలబడి తమ చైతన్యాన్ని చాటుకున్నారు. ఓటింగ్ శాతాన్ని పెంచాలనే కృతనిశ్చయంతో జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. ఓటరు అవగాహన కార్యక్రమాలతో పాటు, ఇంటింటికి ఓటరు సమాచార స్లిప్పులు పంపిణీ చేయడం, అర్బన్ ప్రాంతాలలో గత ఎన్నికలలో పోలింగ్ తక్కువగా నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించడం, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఆదర్శ పోలింగ్ స్టేషన్లను, మహిళలు, దివ్యాంగులు, యువత కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ఓటర్ల దృష్టిని ఆకర్షించింది.


హిమాయత్‌నగర్‌లో...

అతివలు మెచ్చేలా.. అందరూ వచ్చేలా

చేవేళ్ల పార్లమెంట్ నియోజిక వర్గ ప్రాంతంగా ఓటింగ్ శాతం పెంచేందుకు ఎంపిక చేసిన పలు పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మోడల్ పోలింగ్ కేంద్రాలుగా వీటిని తీర్చిదిద్ది.. ఓటు ఆవశ్యకతను అందరికీ తెలిసేలా చేశారు. పలు ప్రాంతాల్లో అధికారులు అట్టహాసంగా మోడల్ పోలింగ్ స్టేషన్లను ప్రారంభించారు. రాజేంద్రనగర్, మహేశ్వరం, చేవెళ్ల, బడంగ్ పేట్, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాలను సుందరంగా అలంకరించారు. ప్రాంతాల్లో మహిళల కోసం ఆదర్శ మహిళ పోలింగ్ కేంద్రాలలో ఓటరు లోపలికి వచ్చే క్రమంలో ఆహ్వాన తోరణాలు.. పూల వర్షంతో స్వాగతాలు పలికి, ఆహ్లాదకర వాతావరణం పోలింగ్ జరిగింది

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో

నియోజకవర్గం	ఉదయం 9గంటలు	ఉదయం 11 గంటలకు	మధ్యాహ్నం ఒంటి గంటకు	మధ్యాహ్నం 3 గంటలకు	సాయంత్రం 5 గంటల వరకు	సాయంత్రం 6 గ. వరకు
మేడ్చల్	8.1	17.84	34.9	42.6	52.12	57.02
మల్కాజిగిరి	4.57	13.88	21,7	33.68	42.37	51.97
కుత్బుల్లాపూర్	7.3	17.21	28.36	35.1	48.2	49.01
కూకట్‌పల్లి	4.45	12.5	25.12	39.65	43.23	47.32
ఉప్పల్	5.8	14.51	26.25	39.28	44.93	47.91
ఎల్‌బీనగర్	4.59	12.36	26.74	34.82	43.76	46.11
కంటోన్మెంట్	6.28	16.34	29.03	39.92	47.88	50.34

వయోవృద్ధుల కోసం ఉచిత రవాణా సౌకర్యం

వయోవృద్ధుల కోసం ఉచిత రవాణా సౌకర్యం వారి యొక్క ఇంటి దగ్గర నుండి పోలింగ్ స్టేషన్‌కి, పోలింగ్ స్టేషన్ నుండి ఇంటి వద్దకు కల్పించడం జరిగింది. వాటితో పాటుగా దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. అంధుల కోసం బ్యాలెట్ పేపర్, ఓటర్ స్లిప్స్ మరియు కరపత్రాలు బ్రెయిలీ లిపిలో తయారు చేసి వారికి అందించారు. నియోజకవర్గాల వారీగా మహిళలు, యువత, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఏర్పా చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్లు ఆకర్శనీయంగా మారాయి. గత ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ జరిగిన నియోజకవర్గాలపై, అర్బన్ సెగ్మెంట్‌పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ స్వీప్ కార్యకలాపాలలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇచ్చినట్లు శశాంక తెలిపారు.

ఓట్ల తొలగింపుపై ఓటర్ల ఆగ్రహం

కీసర : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండల పరిధి రాంపల్లిదాయర, కీసర గ్రామాల్లో ఓటరు జాబితాలో తమ ఓట్లను తొలగించారని ఓటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓట్లు ఉండి, లోక్‌సభ ఎన్నికల సమయంలో ఓట్లు లేకపోవడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. మండల కేంద్రం కీసరలో బూత్ నెంబర్ 187లో దాదాపు 30 ఓట్లను, రాంపల్లి దాయరలో ఏకంగా 275 ఓట్లు తొలగించారని ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తాము లోక్‌సభ ఎన్నికల సమయంలో ఓటుహక్కు వినియోగించుకోలేకపోయామని ఓటర్లు ఆవేదన వ్యక్తం చేశారు.


వికారాబాద్‌లో ఓటేసిన కలెక్టర్ దంపతులు



ఓటేసిన కలెక్టర్లు గౌతమ్, శశాంక


వికారాబాద్‌లో ఓటేసిన ఎస్పీ కోటిరెడ్డి


ఎన్కెపల్లిలో ఓసేందుకు వస్తున్న వృద్ధుడు


రాంపల్లి దాయరలో ఓట్లు తొలగించారని ఆందోళన చేస్తున్న ఓటర్లు

పట్టణవాసులకు పట్టని 'పార్లమెంట్'

అసెంబ్లీతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో భారీగా తగ్గిన ఓటింగ్

- మల్కాజిగిరిలో 7.73శాతానికిపైగా తగ్గుదల
- చేవెళ్ల పార్లమెంట్‌లో 5శాతానికిపైగా తగ్గిన పోలింగ్
- గత పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే స్వల్ప పెరుగుదల
- ఏపీలో ఓటు వేసేందుకు భారీగా తరలివెళ్లిన సెటిలర్స్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

ఈసారి కూడా పార్లమెంట్ ఎన్నికల్లో భారీగా ఓటింగ్ తగ్గింది. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో గణనీయంగా ఓటింగ్‌శాతం పడిపోయింది. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా ఈ ఎన్నికలకు పెద్ద సంఖ్యలో దూరంగా ఉన్నారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇదే రోజు సార్వత్రిక ఎన్నికలు జరగడంతో హైదరాబాద్, చుట్టు పక్కల ప్రాంతాల్లో భారీగా ఉన్న ఆంధ్ర సెటిలర్స్ ఎన్నికల్లో ఓటేసేందుకు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. అయితే ఇక్కడ ఉన్న ఓటర్లు కూడా ఓటేసేందుకు పెద్దగా ముందుకు రాలేదు. వాతావరణం అనుకూలంగా ఉన్నప్పటికీ ముఖ్యంగా పట్టణ వాసులు అధిక సంఖ్యలో ఓటింగ్‌కు దూరంగానే ఉన్నారు. కడపటి సమాచారం మేరకు కొన్ని శివారు నియోజవకర్గాల్లో 50శాతం కూడా ఓటింగ్ దాటలేదు. దాదాపు అయిదున్నర నెలల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో దాదాపు 5శాతం ఓటింగ్ తగ్గడం గమనార్హం. అలాగే మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో దాదాపు 7.73 శాతం ఓటింగ్ తగ్గింది. ఈ రెండు చోట్ల త్రిముఖ పోటీ జరగడంతో అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేశారు. పోటీ తీవ్రంగా ఉండడంతో ఓటింగ్ పెరుగుతుందని భావించారు. కానీ ఓటర్లు ఓటేసేందుకు పట్టణ వాసులు పెద్దగా ఆసక్తిచూపలేదు. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ భారీగా నమోదవుతుంది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆశించిన స్థాయిలో ఓటర్లు ఓటేసేందుకు ముందుక కదలలేదు. ఎన్నికల్లో పోలింగ్‌శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం అనేకచర్యలు చేపడుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఓటర్లలో చైతన్యం రావడం లేదు. ముఖ్యంగా చదువుకున్న వారు, ఉద్యోగస్తులు, యువత అధికంగా ఉండే పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ దారుణంగా ఉంది. అయితే గత పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే మాత్రం ఈ సారి ఓటింగ్ శాతం కొంత మెరుగుపడడం గమనార్హం. ఇదిలా ఉంటే ఉమ్మడిజిల్లాలో అతి తక్కువగా మల్కాజిగిరిలో 42 ఓటింగ్ నమోదైంది. ఇక అత్యధికంగా చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 70.84శాతం ఓటింగ్ జరిగింది.



గత అసెంబ్లీ - ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో పోలైన ఓట్ల శాతం (అసెంబ్లీ వారీగా)

చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో...

అసెంబ్లీ నియోజకవర్గం	2023(అసెంబ్లీ)	2024(పార్లమెంట్)
మహేశ్వరం	55.39	51.70
రాజేంద్రనగర్	55.83	53.13
శేరిలింగంపల్లి	48.75	43.11
చేవెళ్ల	74.18	70.84
పరిగి	76.70	65.98
వికారాబాద్	75.57	69.44
తాండూరు	73.71	66.34
	65.73	60.07
మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో...		
మేడ్చల్	62.24	52.12
మల్కాజిగిరి	54.02	42.37
కుత్బుల్లాపూర్	57.18	48.20
కూకట్‌పల్లి	53.87	42.33
ఉప్పల్	51.54	44.93
ఎల్బీనగర్	49.07	43.76
కంటోన్మెంట్	47.81	47.88
	53.67	45.94

గాలిలో దీపాలు.. కార్మికుల ప్రాణాలు

- షాద్‌నగర్ పారిశ్రామికవాడలో నిత్యం ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోతున్న వేతన జీవులు
- పట్టించుకోని పాలకులు.. కన్నెత్తి చూడని అధికారులు

షాద్‌నగర్ రూరల్, మే 13: పొట్ట చేత పట్టుకొని వందలాది కిలోమీటర్లు వలస వచ్చి పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల ప్రాణాలు గాలిలో దీపాల మాదిరిగా మారుతున్నాయి. ఎప్పుడు.. ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియక బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కార్మికులు పని చేస్తున్న పమయంలో వారికి సేఫ్టీ గార్డ్ సమకూర్చకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకోవడం మామూలైంది. దాంతో నిత్యం కార్మికులు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది.

షాద్‌నగర్ పరిధిలో భారీగా పరిశ్రమలు

షాద్‌నగర్ నియోజకవర్గంలో దాదాపు 156 చిన్నా, పెద్ద పరిశ్రమలున్నాయి. వాటిలో సుమారు 18వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. అందులో కాలుష్యం వెదజల్లే 8 స్పాంజ్ ఐరన్ పరిశ్రమలు ఉన్నాయి. కాగా, వాటిలోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. కార్మికులు ప్రాణాలు కోల్పోయినా యాజమాన్యం ఆ విషయాన్ని బయటికి రానివ్వడం లేదు. స్పాంజ్ ఐరన్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు సేఫ్టీ గార్డ్ ఖచ్చితంగా వాడాలి. హెల్మెట్, షూస్, బ్లౌజులు, బెల్ట్ తప్పనిసరిగా ఇవ్వాలి. అంతే గాకుండా బట్టీల వద్ద ఎయిర్ కూలర్స్ పెట్టాల్సి ఉంటుంది. కానీ, షాద్‌నగర్ ప్రాంతంలో ఎక్కడా కూలర్లు కనిపించిన దాఖలాలు లేవు. కనీసం ఫ్యాన్లు కూడా పెట్టరు.

వైద్యసేవలు నిల్

పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స నిమిత్తం ప్రతీ పరిశ్రమలో ఒక డాక్టర్, కాంపౌండర్, హెల్పర్ ఉండాలి. ఒక్క పరిశ్రమలో కూడా ప్రథమ చికిత్స సౌకర్యం లేదనే ఆరోపణలున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రైవేట్ డాక్టర్లతో ఒప్పందం చేసుకుని కార్మికులను అక్కడికి పంపిస్తున్నారు. అది కూడా కొన్ని పరిశ్రమలు ఆర్ఎంపీ వైద్యులతో వైద్యం అందిస్తున్నాయి. ప్రమాదం జరిగి కార్మికులు మరణిస్తే గుట్టుచప్పుడు కాకుండా సెటిల్‌మెంట్ చేసి వారి గమ్యస్థానాలకు మృతదేహాలను పంపిస్తున్నారు. ఇదిలా ఉండగా, పరిశ్రమలను తరచూ తనిఖీలు చేయాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలున్నాయి. దానికితోడు కేంద్రం తీసుకువచ్చిన చట్టం కార్మికుల పాలిట శాపంగా మారింది. అధికారులు ఏదైనా పరిశ్రమను తనిఖీ చేయాలంటే రెండు రోజుల ముందు సదరు పరిశ్రమకు నోటీసులు ఇవ్వాలి. దాంతో యాజమాన్యాలు అధికారులు తనిఖీలకు వచ్చేరోజు పరిశ్రమకు సెలవు ప్రకటించడం పరిపాటిగా మారింది. మరికొందరు కార్మికులను పనిలోకి రాకుండా చేయడం వంటి ఘటనలు తరచూ జరుగుతుంటాయి. షాద్‌నగర్ ప్రాంతంలోని పరిశ్రమల్లో ఎక్కువగా ఉత్తర ప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి కార్మికులు వలస వచ్చి పనిచేస్తుంటారు.


బూర్గుల శివారులోని పరిశ్రమలో గాయపడిన కార్మికులు(ఫైల్)

గతంలో పట్టణ శివారులోని స్టీమ్ కోర్ పరిశ్రమలో సుమారు 11 మంది కార్మికులు ఫర్నాస్ పట్టీ పేలి తీవ్రంగా గాయపడ్డారు. అందులో ఏడుగురు మృత్యువాతపడ్డారు. ఆ ఘటన పంద్రాగష్టున జరిగింది. ఈ విషయం కేంద్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో సమగ్ర విచారణ చేసి పరిశ్రమను మూసివేశారు. ఆరు నెలల క్రితం బూర్గుల శివారులో ఉన్న ఓ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. అందులో ఎంతమంది చనిపోయారో ఇప్పటికీ తెలియరాలేదు. ఎలికట్ట శివారులో ఉన్న దేవశ్రీ ఐరన్ పరిశ్రమలో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్న కార్మికుల కుటుంబాలు వీధిన పడుతున్నాయి. పరిశ్రమల్లో ఎక్కువగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులే పని చేస్తుంటారు. అందువల్ల ప్రమాదాలు జరుగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాల్సి అవసరం ఉంది.

మెడికల్ డిస్పెన్సరీ లేక ఇబ్బందులు

నియోజకవర్గ కేంద్రమైన షాద్‌నగర్‌లో డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని చాలాకాలంగా కార్మికులు కోరుతున్నారు. అయినా అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. పరిశ్రమల్లో పని చేసే కార్మికులే కాకుండా మున్సిపల్, ఇతర కార్మికులు కూడా ఈఎస్ఐ సదుపాయం పొందుతున్నారు. వారంతా మందుల కోసం కొత్తూరుకు వెళ్లాల్సి వస్తుంది. అందువల్ల షాద్‌నగర్‌లో కూడా ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని కార్మికులు కోరుతున్నారు.

పటిష్టమైన చర్యలు తీసుకోవాలి



పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ప్రతీ కార్మికుడికి విధిగా సేఫ్టీ పరికరాలు అందించాలి. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చే కార్మికులకు అదనపు వేతనం ఇవ్వాలి. కనీస వేతనాలు అమలు చేయాలి.

ఎన్.రాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలి



షాద్‌నగర్‌లో వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి. పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఇతర రాష్ట్రాల కార్మికులు నియోజకవర్గ కేంద్రంలో నివాసముంటున్నారు. ఈఎస్ఐ డిస్పెన్సరీ కోసం కొత్తూరు వెళ్లాల్సి వస్తుంది. ఇక్కడే ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి.

చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, షాద్‌నగర్

ఓటెత్తారు

● లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతం ● భారీగా ఓటేసిన ప్రజలు


షాబాద్ మండలం ముద్దెంగూడలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు

చేవెళ్ల/శంకర్‌పల్లి/షాబాద్/కందుకూరు/శంషాబాద్ రూరల్/మొయినాబాద్ రూరల్/శంషాబాద్/మహేశ్వరం, మే 13 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం నిర్వహించిన పోలింగ్‌లో ఓటర్లు భారీ ఎత్తున ఓటుహక్కును వినియోగించుకున్నారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్, నవాబ్‌పేట్ మండలాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగింది. పోలి ంగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు రాజేంద్రకుమార్ పరిశీలించారు. పోలింగ్ కోసం పోలీస్ శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది. చేవెళ్ల ఏసీపీ కిషన్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సాయంత్రం 5 గంటల వరకు 68.23 శాతం పోలి ంగ్ జరిగిందని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. శంకర్‌పల్లి మండలం పర్వేదలో మధ్యాహ్నం డిటెక్టివ్ సీఐ నాగరాజు వృద్ధులపై లాఠీ ప్రయోగించారు. 144 సెక్షన్ ఉండగా గుంపులుగా ఎందుకు జమయ్యారని వృద్ధులపై చేయిచేసుకున్నారు. దీంతో వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పోలీసులు డౌన్ డౌన్ అని నినదించి ధర్నా చేశారు. సీఐ నాగరాజు నచ్చజెప్పడంతో గ్రామస్తులు శాంతించారు. షాబాద్ మండలంలో 70శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. కొమరబండలో గంట పాటు ఈవీఎం మొరాయించిం ది. కుమ్మరిగూడలో కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్, జడ్పీటీసీ అవినాష్‌రెడ్డి గొల్లూర్‌గూడలో కుటుంబీకులతో ఓటు వేశారు. కందుకూరు మండ లం రాచులూరులో జాతీయ క్రికెట్ టీం మాజీకెప్టెన్ వెదిరె రవికాంత్‌రెడ్డి ఓటుహక్కును వినియోగించుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనీతారెడ్డి సరస్వతిగూడలో, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి కొత్తగూడలో ఓటు వేశారు. జడ్పీటీసీ జంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి కందుకూరులో, ఎంపీపీ జ్యోతి, తిమ్మాపురం, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్ ఆకులమైలారంలో ఓటు వేశారు. అగర్‌మియాగూడ వాసులు ఏ అభ్యర్థి నుంచి డబ్బు తీసుకోలేదు. గ్రామంలో నిర్మించే ఆలయ నిర్మాణానికి నాయకులు సహకరించాలని కోరారు. శంషాబాద్ మండలంలో సాయంత్రం 6గంటల వరకు లైన్లలో ఉన్న ఓటర్లకు అధికారులు అనుమతిచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్ నర్కుడలో, ఎంపీపీ జయమ్మశ్రీనివాస్ పెద్దతూప్రలో, జడ్పీటీసీ తన్వీరాజు నర్కుడలో ఓటు వేశారు. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు. పాల్మాకులలో ఓటు వేసేందుకు వచ్చిన ఓ 80ఏళ్ల వృద్ధుడిని చూసి డీసీపీ నారాయణరెడ్డి అభినందించారు. ఘన్సీమియాగూడలో వెంకటయ్య(75) ప్రమాదంలో రెండుకాళ్లు కోల్పోయినా ప్లాస్టిక్ కాళ్లు పెట్టుకుని ఓటేసేందు కు వచ్చాడు. మొయినాబాద్ మండలం ఎన్కేపల్లిలో ఎన్కేపల్లి 142 బూత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. చిలుకూరు బాలాజీ ఆలయ కమిటీ మెనేజింగ్ కమిటీ చైర్మన్ సౌందరరాజన్, అర్చకులు రంగరాజన్ ఓటు వేశారు. సాయంత్రం 5గంటల వరకు 66.31శాతం ఓటింగ్ నమోదైందని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ తెలిపారు. శంషాబాద్‌లో 54శాతం ఓటింగ్ నమోదైంది. స్లిప్పులు లేనివారి బూత్‌లలోకి పోలీసులు అనుమతించలేదు. మహేశ్వరం నియోజకవర్గంలో 5,56,741 ఓట్లకు గాను 2,93,387 ఓట్లు పోలయ్యాయి.


కందుకూరు: గూడూరులో ఓటేసేందుకు లైన్‌లో ఉన్న మహిళలు

ఇబ్రహీంపట్నం/ఆదిభట్ల/మంచాల/యాచారం: భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం అసెంబ్లీ సెగ్మెంట్‌లో పోలింగ్ ప్రశాతంగా జరిగింది. 66.82 పోలైనట్టు అధికారులు పేర్కొన్నారు. 1,15,709 మంది పురుషులు, 1,11,039 మంది మహిళలు, ఏడుగురు ఇతరులు ఓటుహక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఏఆర్వో కె.అనంతరెడ్డి పోలింగ్‌ను పర్యవేక్షించారు. రాచకొండ కమిషనర్ తరుణ్‌జోషి, మహేశ్వరం డీసీ పీ సునీతారెడ్డి రావిర్యాల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. భువనగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడలో ఓటు వేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎలిమినేడులో ఓటేశారు. ఆదిభట్ల మున్సిపాలిటీలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి ఓటు వేశారు. ప్రజల రాకతో సాగర్ రహదారి కిక్కిరిసింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్సైలు కృష్ణయ్య, వెంకటేష్, రాజు, బాలరాజు బందోబస్తు నిర్వహించారు. మంచా ల మండలంలో వాతావరణం చల్లబడడంతో ఓటేసేందుకు జనం పోలింగ్ కేంద్రాలకు భారీగా వచ్చారు. మండలంలో 73.44శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో 40,029 మంది ఓటర్లు ఉన్నారు. యాచారం మండలంలో ఏపీపీ కేపీవీ.రాజు బందోబస్తును పర్యవేక్షించారు. తాటిపర్తిలో 40 నిమిషాలు ఈవీఎం మొరాయించింది. టెక్నీషియన్లు చేరుకొని బాగు చేశారు. యాచారంలో జాతీయ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి దంపతులు ఓటు వేశారు. భువనగిరి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయం అని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ యాచారంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. నగరంలో ఉంటున్న గ్రామీణులంతా గ్రామాలకు చేరుకొని ఓటు వేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు ఓ టర్లకు భోజన ఏర్పాట్లు చేశారు.


కొందుర్గులోని ఉన్నత పాఠశాల బూత్ వద్ద బారులు తీరిన ఓటర్లు

మండలంలో 48,656 ఓటర్లకు 72.79 శాతం మంది ఓటు వేశారు. మేడిపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటు కోసం అభ్యర్థించిన కొందరిని సీఐ నర్సింహారావు, ఎస్సై నరేష్ దూరంగా పంపించారు.

షాద్‌నగర్/షాద్‌నగర్ అర్బన్/కొందుర్గు/కేశంపేట/కొత్తూర్: మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గంలోని షాద్‌నగర్ సెగ్మెంట్‌లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 77.42 శాతం పోలింగ్ జరిగింది. ఫరూఖ్‌నగర్ మండలం పీర్లగూడెం పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు లోపంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఏఆర్‌ఓ వెంకటమాధవరావు, ఏసీపీ రంగస్వామి పోలింగ్‌ను సమీక్షించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వగ్రామమైన వీర్లపల్లిలో, మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ ఎక్లాస్‌ఖాన్‌పేటలో, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు లింగారెడ్డిగూడలో, మాజీ ఎమ్మెల్యే సి.ప్రతాప్‌రెడ్డి దూసకల్‌లో, సినీ నిర్మాత బండ్ల గణేష్, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ నరేందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, ఎన్.శ్రీవర్ధన్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి షాద్‌నగర్‌లో ఓటుహక్కును వినియోగించుకున్నారు. కొందుర్గు మండలం చెక్కలోనిగూడెం, లూర్దునగర్‌లలో భారీగా ఓటుహక్కును వినియోగించుకున్నారు. షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి బూత్‌లను సందర్శించారు. మండల కేంద్రంలో 77శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. పాలమూరు ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి గెలవబోతున్నారని, దేశప్రజలు రాహుల్‌గాంధీని ప్రధానిగా కావాలని కోరుకుంటున్నారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కేశంపేట మండలం సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట, కొత్తపేట, భైర్ఖాన్‌పల్లి, లేమామిడి, నిర్దవెళ్లి గ్రామాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు. మొదటిసారి ఓటు వేయడం తనకు ఆనందం కలిగించిందని ఎక్లాస్‌ఖాన్‌పేటకు చెందిన బీటెక్ విద్యార్థి వై.శశాంక్‌యాదవ్ అన్నాడు. అల్వాలలో దివ్యాంగుడు పగిడిపాల కృష్ణయ్య గతంలో విద్యుత్ ప్రమాదంలో కృష్ణయ్య రెండుచేతులు కోల్పోయాడు. భార్య జయమ్మతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నాడు. ఎన్నికల అధికారులు అతడి ఎడమ కాలి బొటనవేలికి సిరా పూశారు. మండలంలో 83.1శాతం పోలింగ్ న మోదైంది. కొత్తూర్ మున్సిపాలిటీ, మండల పరిధి గ్రామాల్లో పోలింగ్ ముగిసింది. ఉదయం 12.00గంటల వరకు అధికంగా, మధ్యా హ్నం మందకొడిగా సాగి సాయంత్రం పుంజుకుంది. జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతసత్యనారాయణ, ఎంపీపీ పి.మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బాతుకలావణ్య దేవేందర్‌యాదవ్ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బూత్‌లను పరిశీలించారు.

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం పరిధి కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల, వెల్దండ, కల్వకుర్తి, చారగొడ మండలాల్లో పోలింగ్ సజావుగా సాగింది. యోజకవర్గంలో 72.51శాతం పోలింగ్ నమోదైందని ఏఆర్వో శ్రీను తెలిపారు. ఆమనగల్లు మండలంలో 72.27శాతం, కడ్తాలలో 75.06, తలకొండపల్లిలో 75.57, మాడ్గులలో 68.57శాతం పోలింగ్ నమోదైంది. అసెంబ్లీ ఎన్నికల


కడ్తాలలో ఓటు వేసేందుకు లైన్‌లో ఉన్న మహిళలు

మాదిరిగా ఈ ఎన్నికలకు ఓటర్లు అంతగా ఆసక్తి చూపలేదు. వలస పోయిన వారు పెద్దగా రాలేదు. అడిషనల్ డీసీపీలు రామ్‌కుమార్, శ్రీనివాస్, సీఐలు ప్రమోద్‌కుమార్, శివప్రసాద్, ఎస్ఐలు పోలింగ్ బందోబస్తు నిర్వహించారు. ఏఆర్వో పర్యవేక్షణలో తహసీల్దార్లు లలిత, ముంతాజ్, రంగారెడ్డి పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. కడ్తాల మండలం ముద్విన్‌లో నల్లగుట్ట వద్ద మైనింగ్‌కు ఇచ్చిన అనుమతులను రద్దుచేసే వరకు ఓటు వేయం అని గ్రామస్థులు నిర్ణయించారు. విషయం తెలుసుకున్న ఏఆర్‌వో శ్రీను, సీఐ శివప్రసాద్, తహసీల్దార్ చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. పోలింగ్ అనంతరం అధికారులు, సిబ్బంది ఈవీఎమ్‌లు, వీవీప్యాట్ లను వాహనాల్లో నాగర్‌కర్నూల్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.


ఆమనగల్లు : పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

రాష్ట్రంలో 15 సీట్లను కాంగ్రెస్ కైవశం చేసుకుంటుందన్నారు. ఆకుతోటపల్లిలో ఆయన కసిరెడ్డి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకంటే కాంగ్రెస్ బలం పుంజుకుందన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ మంగమ్మనారాయణ, శేఖర్‌గౌడ్, రాజశేఖర్, బుచ్చయ్య, ఖుద్దూస్ పాల్గొన్నారు. కాగా పలువురు రాజకీయ ప్రముఖులు స్వగ్రామాల్లో ఓటుహక్కును వినియోగించుకున్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కడ్తాల మండలం చల్లంపల్లిలో, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఆమనగల్లులో, రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి వెల్దండ మండలం నారాయణపూర్‌లో, నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ కల్వకుర్తి మండలం గుండూరులో ఓటు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి ఆమనగల్లులో సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు కృష్ణారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డిలతో కలిసి పోలింగ్ సరళిని పరిశీలించారు.


ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్‌లో బారులు తీరిన ఓటర్లు


ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధి శేరిగూడలో ఓటేసిన భువనగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్


పర్వేదలో పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న గ్రామస్తులు


కందుకూరు : సరస్వతి గూడలో ఓటు హక్కును వినియో గించుకున్న జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి


యాచారంలో ఓటు హక్కు వినియోగించుకున్న జాతీయ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి దంపతులు


రావిర్యాల పోలింగ్ బూత్‌ను సందర్శించిన రాచకొండ సీపీ తరుణ్ జోషి


ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడులో ఓటేసిన మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి


శంషాబాద్ రూరల్: ఓటుహక్కు వినియోగించుకున్న 80ఏళ్ల వృద్ధుడిని అభినందిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి


కందుకూరులో ఓటుహక్కు వినియోగించుకున్న దివ్యాంగురాలు


భార్య జయమ్మతో కలిసి ఓటు వేసిన దివ్యాంగుడు పగిడిపాల కృష్ణయ్య (కాలికి సిరా)


యాచారంలో ఓటర్లతో మాట్లాడుతున్న భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్


షాద్‌నగర్ : ఓటు వేసేందుకు రిక్షాలో వచ్చిన వృద్ధురాలు


వీర్లపల్లిలో ఓటు వేసిన ఎమ్మెల్యే శంకర్


ఎక్లాస్‌ఖాన్‌పేటలో మాజీ అంజయ్యయాదవ్..


షాద్‌నగర్‌లో ఓటు వేసిన సినీ నిర్మాత బండ్ల గణేష్, కుటుంబీకులు


కొత్తూర్ మండలం ఇన్ముల్‌నర్వలో బారులు తీరిన ఓటర్లు


ఆమనగల్లు: ఈవీఎం, వీవీ ప్యాట్‌లను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది


తుక్కుగూడలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన మాజీ హోం మంత్రి టీ.దేవేందర్‌గౌడ్


చేవెళ్ల: కౌకుంట్లలో ఓటు వేసిన మాజీ మంత్రి సబితారెడ్డి, ముగ్గురు తనయులు, కోడలు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తలకొండపల్లి, మే 13 : వెంకటాపూర్‌లో గుండాల వెంకటయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. అతడి కుటుంబాన్ని సోమవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్.శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించి రూ.5వేలు అందజేశారు. స్థానిక నాయకులు ఆంజనేయులుగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్ వెయ్యి చొప్పున ఇచ్చారు. పరామర్శించిన వారిలో వెంకటయ్య, నిరంజన్, మల్లేశ్, కృష్ణయ్య, జంగయ్య, రాజు, శేఖర్ ఉన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీనివాస్ యాదవ్

సీబీఎస్ఈ ఫలితాల్లో బటర్‌ఫ్లై విద్యార్థుల ప్రతిభ

కడ్తాల్, మే 13 : సీబీఎస్ఈ పది, 12 తరగతుల ఫలితాల్లో కడ్తాలలోని ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. పదో తరగతిలో వంద శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. కందికంటి హర్షిక 600 మార్కులకు 561 సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. బండ శ్రావణి 559, ఎం.రిత్విక్ 550 మార్కులు సాధించారు. 12వ తరగతిలో డి.రోహిత్ 500కు 423, ఎం.నిఖిల్‌రెడ్డి 422, ఎస్.సంజయ్ 413 చొప్పున మార్కులు సాధించారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ శేషగిరిరావు, కో-చైర్మన్ రమేశ్, ప్రిన్సిపాల్ సంజీవ్ అభినందించారు.

నీరు లేక నిరుపయోగంగా నీటితొట్లు

ఆమనగల్లు, మే 13: పశువుల తాగునీటి కోసం ఏర్పాటు చేసిన నీటితొట్లు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. వేల రూపాయలు వెచ్చించి నిర్మించిన నీటితొట్లు చాలాచోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. నీటితొట్ల నిర్మాణంలో చూపిన శ్రద్ధ ప్రజాప్రతినిధులు, నాయకులు వాటి నిర్వహణ విషయంలో చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆమనగల్లు మండలంలో దశాబ్దం క్రితం వాటర్‌షెడ్, ఈజీఎస్ పథకం ద్వారా సుమారు 50 వరకు పశువుల నీటితొట్లను నిర్మించారు. అప్పట్లో తొట్లకు నీరందించడానికి గ్రామ పంచాయతీల ద్వారా పైపులైన్లు ఏర్పాటు చేసి నీరందించారు. వేసవిలో నీటి తొట్లు పశువులకు ఎంతగానో ఉపయోగపడేవి. క్రమంగా నిర్వహణ కొరవడి చాలా చోట్ల నీటి తొట్లు శిథిలం అయ్యాయి. ఉన్న చోట్ల కూడ నీటి సరఫరా పైపు లైన్లు తొలగించడంతో వినియోంలో లేకుండా పోయాయి. ప్రస్తుత వేసవిలో పశువుల నీటికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోరు బావులు, చెరువు కుంటల్లో కూడా నీరు తక్కువైంది. పశువులకు నీరు తాపేందుకు రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవతీసుకొని నీటి తొట్లను వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.


చెన్నంపల్లిలో నిరుపయోగంగా ఉన్న పశువుల నీటి తొట్టి

ముమ్మరంగా వంతెన నిర్మాణం

● ముద్విన్‌లో పూర్తి కావొస్తున్న బ్రిడ్జి
● నెల రోజుల్లో ప్రారంభానికి అధికారుల చర్యలు

కడ్తాల్, మే 13 : మండల పరిధి ముద్విన్-ఆకుతోటపల్లి గ్రామస్తుల దశాబ్దాల కల సాకారం అవుతోంది. ముద్విన్ వాగుపై వంతెన నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పనులు తుది దశకు చేరుకున్నాయి. ముద్విన్ వాగుపై 20ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన వర్షాల తాకిడికి కొట్టుకుపోయింది. దీంతో ముద్విన్, ఆకుతోటపల్లి, గౌరారం, శెట్టిపల్లి గ్రామాల ప్రజలు ఏళ్ల కాలంగా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వాగుపై వంతెన నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు తీర్చాలని గ్రామాల ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చారు. అనేక సార్లు ఆందోళనలు చేపట్టారు. ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి తమ ఇబ్బందులను విన్నవించారు. దీంతో గతేడాది ఎఫ్‌డీఆర్ నిధుల ద్వారా ముద్విన్-ఆకుతోటపల్లి రోడ్డులో వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.85కోట్లు విడుదల చేసింది. 2023 ఏప్రిల్ 5న వంతెన పనులకు అప్పటి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పనులు వెంటనే చేపట్టి ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. నెల రోజుల్లో పనులు పూర్తి చేసి రానున్న వానాకాలం నాటికి వినియోగంలోకి తెచ్చేందుకు, నాణ్యతగా నిర్మిం చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వంతెన నిర్మాణం అయితే కడ్తాల, మాడ్గుల, ఆమనగల్లు మండలాల్లోని గ్రామాల వాసులకు ఇబ్బందులు తొలగుతాయి.


పూర్తి కావొస్తున్న వంతెన నిర్మాణ పనులు